సాక్షి
కాకినాడ
గురువారం | 14 | సెప్టెంబర్ | 2023



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన భవనం నిర్మాణానికి వేగేశ్న వీఎస్‌కేడీఎన్ సోమరాజు, సరస్వతి దంపతులు బుధవారం రూ.లక్ష విరాళం అందించినట్లు ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 4,600, మధ్య డెల్టాకు 2,200,పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

డిజిటల్ వెలుగులు



డిజిటల్ టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతోంది. కూరగాయల నుంచి కంప్యూటర్ వరకు ఏ వస్తువు కొనుగోలు చేసినా ప్రతీ ఒక్కరూ ఆన్‌లైన్ చెల్లింపులకే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ ఇంటి పన్నులను కూడా ఆన్‌లైన్ ద్వారా కట్టించుకుంటోంది. ఇప్పుడు విద్యుత్ బిల్లులను వినియోగదారులు ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తున్నారు.

8లో

న్యూస్‌రీల్

చంద్రబాబు అరెస్టుకు ఎవరూ బాధపడటంలేదు

కాకినాడ రూరల్: చంద్రబాబు అరెస్టును రాజకీయంగా వాడుకోవాలని టీడీపీ చూస్తోందని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. , ఆయన అరెస్టుకు ఎవరూ బాధపడటం లేదన్నారు. కాకినాడ రూరల్ సూర్యారావుపేటలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు తప్పు చేశారని జనం ముందు తలవంచుకునే పరిస్థితి టీడీపీకి కనిపించడం లేదన్నారు. చంద్రబాబు అరెస్టుతో వచ్చే ఎన్నికల్లో గెలుస్తామనే భ్రమల్లో ఉన్నారన్నారు. 40 ఏళ్ళు రాజకీయాల్లో ఉండి, 14ఏళ్ళు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తికి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో భద్రత ఉంటుందో లేదో తెలియదా అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబుకు హౌస్ అరెస్టు వెసులుబాటు ఉంటే జేబులు కొట్టే దొంగలకు కూడా అదే వర్తిస్తుందన్నారు. రాజ్యాంగం, చట్టం ముందు అందరు సమానులే అన్నారు. రాజకీయం అంటే బాలకృష్ణ సినిమా అనికుంటున్నారేమోనని, రాజకీయ జన జీవనంలో చాలా స్పృహతో మాట్లాడాలన్నారు.

గాజువాక వెళ్లి కొత్త పింఛను అందజేత



గాజువాక కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సింహాచలానికి పింఛను అందిస్తున్న వలంటీరు అమరావతి

కోటనందూరు: మండలంలోని ఇండుగపల్లి గ్రామానికి చెందిన దారకొండ సింహాచలం నరాల సంబంధిత సమస్యతో విశాఖ జిల్లా గాజువాకలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సింహాచలానికి ఈ నెలలో కొత్తగా పింఛను మంజూరైంది. పేదవాడు కావడంతో సింహాచలం ఆసుపత్రిలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. కాగా సర్పంచ్ కె.సత్యవతి ప్రోత్సాహంతో గ్రామ వలంటీర్ గుడివాడ అమరావతి, గృహసారథి గుడివాడ నానాజీ ఆసుపత్రికెళ్లి సింహాచలానికి పింఛను అందజేశారు. వలంటీర్ సేవలపై బాధిత కుటుంబం సంతోషం వ్యక్తం చేసింది.

రేపు జగనన్నకు చెబుదాం

కాకినాడ సిటీ: మండల స్థాయి జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని పెదపూడి మండలంలో శుక్రవారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం తెలిపారు. పెదపూడి ఎంపీడీవో కార్యాలయంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతుందని, అర్జీదారులు, అధికారులు గమనించాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు.

ఆరోగ్యానికి సంపూర్ణ భద్రత

- ఈనెల 15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష అమలు
- ఆరోగ్య సమస్యలపై ఇంటింటి సర్వే
- పల్లె, పట్టణాల్లో శిబిరాలు ఏర్పాటు
- సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు
- అవసరమైతే పెద్ద ఆసుపత్రులకు సిఫార్సు



జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలుపై జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా



కాకినాడ సిటీ: విప్లవాత్మక చర్యలతో వినూత్న పథకాలతో దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు విశేషంగా కృషి చేస్తోంది. నాడు–నేడు కార్యక్రమంలో పట్టణాలు, మండల కేంద్రాల్లోని సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలను ఇప్పటికే అత్యాధునిక వసతులతో నిర్మించింది. సుదీర్ఘ కాలంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసింది. వైద్యులను అందుబాటులోకి తెచ్చింది. గ్రామ, వార్డు సచివాలయ పరిధిల్లో విలేజ్, అర్బన్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 12 రకాల వైద్య సేవలు, 16 వైద్య పరీక్షలు, 105 రకాల మందులను రోగులకు ఉచితంగా అందిస్తోంది. పెద్ద ఎత్తున 108 వాహనాలను సమకూర్చింది. సమాచారమిచ్చిన క్షణాల్లో అత్యాధునిక వైద్యం లభించే ఆస్పత్రులకు చేరేలా వసతులు కల్పించింది. అలాగే దీర్ఘకాలిక వ్యాధుల వారికి 104 వాహనాల ద్వారా ప్రతి నెలా గ్రామాల్లో వైద్యం, మందులను ఉచితంగా పంపిణీ చేస్తోంది. వీటితో పాటు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఎబీడీఎం) కార్యకలాపాల అమల్లో రాష్ట్ర వైద్యశాఖ దేశంలోనే ఉత్తమ పనితీరుకు ప్రతీకగా నిలిచింది.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్

2021లో ప్రారంభించిన టెలీ మెడిసిన్ ద్వారా వయోవృద్ధులు, మహిళలకు సేవలు అందించడంలో ఏపీ అగ్రస్థానంలో ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రకటించింది. గతేడాది ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ప్రారంభించింది. రోగి ఇంటికే ప్రభుత్వ వైద్యుడు నేరుగా వెళ్లి సేవలందించేలా చర్యలు తీసుకుంది. తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట బృహత్తర కార్యక్రమాన్ని అమలు చేసేందుకు సిద్ధమైంది. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని సంకల్పించింది. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందుకు అనుగుణంగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ఈనెల 30 నుంచి వైద్య శిబిరాలను నిర్వహించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కృషి చేస్తోంది.

వైద్య శిబిరాల నిర్వహణ

ఇప్పటికే జిల్లా ఉన్నత స్థాయి అధికారులకు జగనన్న ఆరోగ్య సురక్షపై రెండు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర స్థాయి వైద్య బృందం కూడా దీనిపై ఎప్పటికప్పుడు ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. 15న వలంటీర్లు సురక్ష షెడ్యూల్ వివరాలు తెలియజేస్తారు. 16 నుంచి ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటి వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. క్యాంప్ నిర్వహణ తేదీ టోకెన్‌లు, 20న ఆరోగ్యశ్రీ కరపత్రాల పంపిణీ చేస్తారు. 30న మొదటి సురక్ష క్యాంపు ప్రారంభిస్తారు. షెడ్యూల్ ప్రకారం నెలరోజులు వేర్వేరు ప్రాంతాల్లో కొనసాగుతుంది. జిల్లాలో 21 మండలాల్లోని 620 విలేజ్ క్లినిక్‌లు, 23 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మొత్తం 896 మెగా వైద్యశిబిరాలను ఏర్పాటు చేయనున్నారు.

స్పెషలిస్టుల పర్యవేక్షణలో..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 30 నుంచి ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతంలోని పాఠశాలలు లేదా అనువైన భవనాల్లో ఏర్పాటు చేస్తారు. పట్టణాల్లో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద శిబిరాలు నిర్వహిస్తారు. విద్యార్థులతో పాటు రక్తహీనత ఉన్న బాలికలకు శిబిరానికి వచ్చే ముందే స్క్రీనింగ్ నిర్వహిస్తారు. ప్రతి శిబిరం వద్ద ఇద్దరు స్పెషలిస్టు, స్థానిక పీహెచ్‌సీల్లోని ఇద్దరు వైద్యులను ప్రభుత్వం కేటాయించింది.

పలు శాఖల భాగస్వామ్యం

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ఏర్పాటు బాధ్యతను గ్రామీణ ప్రాంతంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఆయా పీహెచ్‌సీ వైద్యులకు, పట్టణంలో మున్సిపల్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులకు అప్పగించారు. మండలంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు సమానంగా విభజించి ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వైద్యుల సమన్వయంతో మెడికల్ క్యాంపులను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తారు. పట్టణంలో మున్సిపల్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్, వైద్యుల భాగస్వామ్యంతో శిబిరాలు కొనసాగుతాయి. జిల్లా స్థాయిలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు జెడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు బృందాలుగా పర్యవేక్షిస్తారు.

సురక్ష లక్ష్యాలిలా..

- ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేయడం.
- వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలో ఇళ్లకు వెళ్లి షెడ్యూల్‌ను తెలియజేయడం.
- ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం
- ఆరోగ్య వివరాల కేస్ షీట్, పరీక్ష ఫలితాలను వైద్యులకు అందించడం.
- ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయడం
- శిబిరంలో పరీక్షలు చేసి చికిత్స అందిస్తారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు.
- అవసరమైన వారికి స్పెషలిస్టు వైద్యుల సేవందేలా , పెద్ద ఆసుపత్రులకు సిఫార్సు.
- సురక్ష ద్వారా అందరికీ అన్ని ఆరోగ్య సమస్యల్ని పరిష్కరించడం.



మెగా క్యాంప్‌లతో పేదలకు ప్రయోజనం



జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ఎంతో ఉపయోగకరం. ఈనెల 15 నుంచే వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవసరమైన పరీక్షలు నిర్వహిస్తారు. శిబిరం వివరాలతో కూడిన టోకెన్ ఇస్తారు. మెగా వైద్యశిబిరాల తరహాలో ఏర్పాటయ్యే ఈ శిబిరంలో రెండు పీహెచ్‌సీల వైద్యులతో పాటు స్పెషలిస్టులు పాల్గొంటారు. ప్రజలు ఈ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా గ్రామాల్లోకి వచ్చే వైద్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ కృతికా శుక్లా, జిల్లా కలెక్టర్

రోజుకో గ్రామంలో శిబిరం



ప్రతిరోజు ఒక గ్రామంలోను, పట్టణ పరిధిలోని యుపీహెచ్‌సీ పరిధిలోను జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మెగా వైద్య క్యాంప్ నిర్వహిస్తున్నాం. 21 మండలాల్లోను, 7 పట్టణాల్లో పీహెచ్ వైద్యులతో పాటు స్పెషలిస్టులు పాల్గొంటారు. రోగులకు అదనపు పరీక్షలు అవసరమైతే క్యాంప్‌లో చేస్తారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఫ్యామిలీ డాక్టర్ ఒకమైలు రాయికాగా, ఆరోగ్య సురక్ష అమలుతో మరొక ముందడుగు వేయబోతున్నాం.

– డాక్టర్ పావని, జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి (డీపీఎం)

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత

- డీఎస్‌ఏ చీఫ్‌కోచ్ శ్రీనివాస్‌కుమార్
- పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా స్థాయి ఎంపిక




జిల్లా స్థాయి ఎంపికల్లో స్విమింగ్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా స్థాయి ఎంపికలు బుధవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. డీఎస్‌ఏ చీఫ్‌కోచ్ బి.శ్రీనివాస్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని అన్నారు. గౌరవ అతిథిగా అర్బన్ ఎంఈఓ సీహెచ్ రవి హాజరయ్యారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షతన హాకీ, రెజ్లింగ్, ఆర్చరీ, చెస్ అండర్–17 బాలురు, బాలికలు, అండర్–14 బాలురు, బాలికల విభాగాల్లో ఎంపికలు నిర్వహించారు. 880 మంది క్రీడాకారులు హాజరు కాగా, వారి నుంచి 230 మందిని అంతర్ జిల్లా పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ సీనియర్ పీడీ, పీఈటీలతో కమిటీ ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు జార్జి, జిల్లా అధ్యక్షుడు రవిరాజు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఇంటర్ చదువుతో ఉద్యోగం

- రాష్ట్రప్రభుత్వం చొరవతో సాకారం
- 75 శాతం ఉత్తీర్ణత సాధించిన అన్ని గ్రూపుల విద్యార్థులూ అర్హులే
- నవంబర్‌లో రిజిస్ట్రేషన్



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఇంటర్మీడియెట్ పూర్తి కాగానే విద్యార్థులు ఉద్యోగస్తులుగా మారనున్నారు. అది కూడా సాఫ్ట్‌వేర్ కంపెనీలో కొలువు. ఉద్యోగం చేస్తూ ఉన్నత చదువులు చదువుకునే అవకాశం కూడా ఉంది. ఇంటర్మీడియెట్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్ బి సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 75 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసిన అన్ని గ్రూపుల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అందనున్నాయి. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 2023–23లో ఇంటర్ పూర్తి చేసిన వారికి, 2024 విద్యాసంవత్సరంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దీనికి అర్హులు. ఆసక్తి కలవారు నవంబర్‌లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి. నమోదు చేసుకున్న విద్యార్థులకు మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ చేపడతారు. మొదట క్యాట్ ఎగ్జామ్, తర్వాత ఇంగ్లిష్ వర్సంట్ పరీక్ష, ఫైనల్‌గా ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ మూడింటిలో ఉత్తీర్ణత సాధించాక, ఒక ఏడాది శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కాలంలో ఏడో నెల నుంచి నెలకు రూ.10 వేల స్టైఫండ్ ఇస్తారు. విద్యార్థులు రెండు విభాగాల్లో ఉద్యోగాలు అందుకోవచ్చు. ఇంటర్ ఎంపీసీ, ఎంఈసీ చదివిన విద్యార్థులు ఐటీ రంగంలోనూ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ కోర్సులు చదివిన వారికి అడ్మినిస్ట్రేటివ్‌కు సంబంధించి డీపీవో విభాగంలోనూ ఉద్యోగాలు అందించనున్నారు.

ఉద్యోగం చేస్తూ ఉన్నత విద్య

ఇంటర్‌తో ఉద్యోగంలో చేరిన విద్యార్థులు వారి చదువు అక్కడితో ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రణాళిక రూపొందించారు, దీనికి పలు ఉన్నత యూనివర్సిటీల నుంచి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. వీటిలో బిట్స్ పిలానీ, శస్త్ర, ఎమిటీ, ఐఐఎం నాగ్‌పూర్, కేఎల్ యూనివర్సిటీలున్నాయి. వీటిలో ఉన్నత విద్యను అభ్యసించే దిశగా విద్యార్థులు చెల్లించే ఫీజులో కొంత హెచ్‌సీఎల్ కంపెనీ రూ.15 వేలు ఏటా ఫీజుకు ఇవ్వనుంది.

కాలేజీల ప్రిన్సిపాళ్లకు సమావేశాలు

జిల్లా	వేదిక	తేదీ
కాకినాడ	కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల	15
తూర్పుగోదావరి	రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల	16
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల	16

వినియోగించుకోవాలి



విద్యార్థులు ఇంటర్‌తో ఉద్యోగం సంపాదించుకునేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. దీని ద్వారా ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులు సాధించిన వారు ఐటీ రంగంలో ఉద్యోగాలు సాధించవచ్చు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. దీనిపై అన్ని యాజమాన్యాల ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు అవగాహన పెంచుకునేలా సమావేశం ఏర్పాటు చేశాం.

– ఐ.శారద, ఇంటర్ బోర్డు రీజినల్ జాయింట్ డైరెక్టర్, జోన్ –2

మీ చిట్టి చేతులతో మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకువెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం! జిల్లా స్పాన్సర్‌గా శ్రీ షిర్డి సాయి విద్యా సంస్థలు వ్యవహరిస్తున్నారు.

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా :
శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్
సురేష్‌నగర్, కాకినాడ

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 9010224454

District sponsor
SRI SHIRDI SAI
GROUP OF EDUCATIONAL INSTITUTIONS
RAJAHMUNDRY KADIYAM
website : www.sssjc.in

15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే

కాకినాడ సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతుంద కలెక్టర్ కృతికాశుక్లా పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, డీఎంహెచ్‌వో డాక్టర్ జె నరసింహనాయక్, ఆర్‌ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, విద్య తదితర శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఎన్‌ఎం, సీహెచ్‌వో, ఆశా, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటారని, వారికి అవసరమైన ఆరోగ్య సేవలను గుర్తిస్తారని తెలిపారు. ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేస్తారన్నారు. 30 నుంచి గ్రామాలు, పట్టణాల్లో హెల్త్ క్లినిక్, సచివాలయం యూనిట్‌గా జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాలు ఏర్పాటువుతాయన్నారు. 45 రోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూడా కీలక భాగస్వామ్యం అందించనున్నట్లు వివరించారు.

కలెక్టర్‌ను కలసిన జిల్లా ఉప కార్మిక కమిషనర్

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉప కార్మిక కమిషనర్‌గా పి.శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు.

రేపటి ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ రద్దు

కాకినాడ సిటీ: ఈనెల 15న నిర్వహించాల్సిన ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్లు కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోటనందూరు తహసీల్దార్ సస్పెన్షన్



జగదీష్

తుని రూరల్: కోటనందూరు మండల తహసీల్దార్ ఐ.జగదీష్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జగదీష్ తుని మండలం రేఖవానిపాలెంలో పౌరసరఫరాల గొడౌన్లకు ఇన్‌చార్జిగా కూడా ఉన్నారు. గొడౌన్లో బియ్యం, కందిపప్పు నిల్వలు సక్రమంగా లేకపోవడంతో ఇటీవల ఉన్నత అధికారులు ప్రాథమిక విచారణ నిర్వహించారు. గొడౌన్లలో సరుకులు, రికార్డులను పరిశీలించారు. రికార్డులకు అనుగుణంగా నిల్వలు లేకపోవడంతో అవకతవకలు జరిగినట్టు గుర్తించి తహసీల్దార్ జగదీష్‌ను సస్పెండ్ చేసినట్టు పేర్కొన్నారు. తుని రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న కందుల కుశరాజును కోటనందూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించారు.

నేటి నుంచి రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ సభ్యుడి పర్యటన

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ జిల్లాలో ఈనెల 14వతేదీ నుంచి 16వ తేదీ వరకు పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా బుధవారం తెలిపారు. ఈనెల 14వతేదీ కాకినాడ ఆర్‌అండ్‌బి అతిథి గృహానికి చేరుకుంటారు. 15వతేదీ ఉదయం బయలుదేరి రౌతులపూడి మండలంలో పర్యటించి అక్కడ గిరిజనుల సమస్యలను తెలుసుకుంటారన్నారు.రౌతులపూడి నుంచి బయలుదేరి కాకినాడ చేరుకుని మధ్యాహ్నం 3 గంటలకు ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో అధికారులు, షెడ్యూల్ ట్రైబ్స్ నాయకులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. 16వతేదీ ఉదయం శంఖవరం మండలంలోని గిరిజనులతో మాట్లాడతారు.

క్లుప్తంగా

వైద్య ఆరోగ్యశాఖ పోస్టుల భర్తీలో ప్రొవిజినల్ జాబితా విడుదల

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీగానున్న పోస్టుల భర్తీలో భాగంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితా వివరాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వైద్య సేవల సమన్వయకర్త ఎం.సనత్‌కుమారి బుధవారం తెలిపారు. ఈ నెల రెండు నుంచి ఎనిమిదో తేదీ వరకు వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీగానున్న పోస్టులకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన దరఖాస్తులు స్వీకరించామన్నారు. వీటికి సంబంధించి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఈస్ట్‌గోదావరి.నిక్.ఇన్ వెబ్‌సైట్‌లో ప్రొవిజినల్ లిస్టులు అందుబాటులో ఉంచామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 14 నుంచి 15వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా రిక్రూట్‌మెంట్ 2023 ఏపీవీవీపీ అనే జీ మెయిల్, కొవ్వూరు ఆసుపత్రిలోని ఆసుపత్రుల సేవల సమన్వాయాధికారి కార్యాలయంలోను తగిన ఆధారాలతో సమర్పించాలన్నారు. తర్వాత వచ్చిన అభ్యంతరాలు పరిశీలించబోమన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా వెబ్‌సైట్‌లో పొందుపర్చుతామన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో పొందుపర్చిన గ్రీవెన్స్‌లోనే దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. లేనిపక్షంలో వాటిని పరిగణలోకి తీసుకోమన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ రోడ్డులోని పిట్లవానిచెరువులో సుమారు 45ఏళ్ల మహిళ మృతదేహం తేలిఆడుతున్న ఘటన బుధవారం మధ్యాహ్నం సంచలనమైంది. పోలీసుల కథనం ప్రకారం పిట్లవానిచెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం తేలి ఆడడంతో స్థానికులు బొమ్మూరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలాన్ని బొమ్మూరు ఎస్సై వెంకయ్య పరిశీలించారు. మృతదేహం బాగా ఉబ్బిపోవడంతో గుర్తుపట్టనివిధంగా ఉంది. దీంతో పోలీసులు మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై వెంకయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహిళ వివరాలు తెలిసిన వారు 0883–2434173 ఫోన్ నంబరులో తెలియజేయాలని ఎస్సై వెంకయ్య కోరారు.

డిజిటల్ వెలుగులు

- ఆన్‌లైన్ ద్వారా 88 శాతం విద్యుత్ బిల్లుల చెల్లింపు
- రెండేళ్లలోనే 58 శాతానికి పెరుగుదల
- వినియోగదారులకు సమయం, డబ్బు ఆదా

రాయవరం: డిజిటల్ టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతోంది. కూరగాయల నుంచి కంప్యూటర్ వరకు ఏ వస్తువు కొనుగోలు చేసినా ప్రతీ ఒక్కరూ ఆన్‌లైన్ చెల్లింపులకే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ ఇంటి పన్నులను కూడా ఆన్‌లైన్ ద్వారా కట్టించుకుంటోంది. ఇప్పుడు విద్యుత్ బిల్లులను వినియోగదారులు ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తున్నారు. గతంలో విద్యుత్ శాఖలో బిల్లుల చెల్లింపులు, నూతన విద్యుత్ సర్వీస్ కనెక్షన్, అదనపు లోడ్ కోసం నగదును మాన్యువల్‌గా అందజేసేవారు. మూడేళ్లుగా విద్యుత్‌శాఖ డిజిటల్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో డిజిటల్ లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. రెండేళ్ల క్రితం ఏపీఈపీడీసీఎల్ జిల్లా పరిధిలో డిజిటల్ పేమెంట్లు 30 శాతం ఉండగా ప్రస్తుతం 88 శాతానికి పెరిగాయి.

ప్రయోజనాలివీ..

- విద్యుత్ వినియోగదారులు వారి వద్ద ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్ ద్వారా ఏపీఈపీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని విద్యుత్ బిల్లులను డిజిటల్ పద్ధతిలో చెల్లించడంతో వినియోగదారుల సమయం ఆదా అవుతుంది.
- విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడే బాధ తప్పుతుంది.
- బిల్లులను నిర్ణీత గడువు లోపు ఎప్పుడైనా, ఎక్కడైనా చేతిలో ఫోన్ ద్వారా చెల్లించవచ్చు.
- ఈ సేవా కేంద్రాల్లో సర్వీస్ ట్యాక్స్ రూపంలో చెల్లించే అదనపు నగదు మిగులుతుంది.
- డిజిటల్ పద్ధతిలో నగదు క్యాష్‌బ్యాక్ పొందే అవకాశం ఉంటుంది.

విస్తృత ప్రచారం

విద్యుత్ శాఖ డిజిటల్ పేమెంట్లపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేపడుతోంది. డిజిటల్ పేమెంట్లు చేయడం వల్ల కలిగే లాభాలను కరపత్రాల రూపంలో ముద్రించి సిబ్బంది ద్వారా వినియోగదారులకు అందజేస్తున్నారు. ఇప్పటికే అధిక సంఖ్యలో వినియోగదారులు ఆండ్రాయిడ్ ఫోన్లను వినియోగిస్తుండడం, క్షణాల్లో డిజిటల్ పేమెంట్ల ద్వారా చెల్లింపులు జరగడంతో విద్యుత్ వినియోగదారులు కూడా డిజిటల్ చెల్లింపులకే ప్రాధాన్యమిస్తున్నారు.

ఏ యాప్‌ల్లో చెల్లించవచ్చు

విద్యుత్ బిల్లులను డిజిటల్ పద్ధతిలో చెల్లించాలనుకునే వారు ప్రధానంగా గూగుల్ పే డౌన్‌లోడ్ చేసుకుని అందులో ఈపీడీపీసీఎల్ ఏపీని క్లిక్ చేసి బిల్లులు చెల్లించవచ్చు. గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే, బిల్ డెస్క్, ఏపీ ఆన్‌లైన్, గ్రామ, వార్డు సచివాలయ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చు.



రాయవరం మండలం సోమేశ్వరంలో నాన్ డిజిటల్ విధానంలో క్యూలో నిలబడి నగదు చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు

శత శాతం డిజిటల్ పేమెంట్లు లక్ష్యం



ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు డిజిటల్ విధానంలో జరుగుతున్నాయి. గతంతో పోలిస్తే వినియోగదారుల్లో అవగాహన పెరిగింది. ఈపీడీపీసీఎల్ కూడా డిజిటల్ పేమెంట్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. శతశాతం డిజిటల్ పేమెంట్ల లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– విజయానంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, రామచంద్రపురం డివిజన్



డిజిటల్ విధానంలో చెల్లింపులు చేయాలంటూ ఈపీడీసీఎల్ కరపత్రం

జిల్లాల వారీగా డిజిటల్, నగదు చెల్లింపులు ఇలా..

తూర్పుగోదావరి

మొత్తం కనెక్షన్లు: 3,24,823
మొత్తం చెల్లింపులు: రూ.4,431.12(లక్షల్లో)
నగదు చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు : 70,183
నగదు రూపేణా చెల్లించే మొత్తం: రూ.908.68 లక్షలు
డిజిటల్ చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు: 2,54,640
చెల్లించే మొత్తం: రూ.3,522.44 లక్షలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

మొత్తం కనెక్షన్లు: 4,96,020
మొత్తం చెల్లింపులు: రూ.5,831.08 (లక్షల్లో)
నగదు చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు: 59,973
నగదు రూపేణా చెల్లించే మొత్తం: రూ.738.62 లక్షలు
డిజిటల్ చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు: 4,36,047
చెల్లించే మొత్తం: రూ.5,092.46లక్షలు

కాకినాడ

మొత్తం కనెక్షన్లు: 5,72,509
మొత్తం చెల్లింపులు: రూ.7,678.64 (లక్షల్లో)
నగదు చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు: 1,12,372
నగదు రూపేణా చెల్లించే మొత్తం: రూ.1,214.99 లక్షలు
డిజిటల్ చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు: 4,60,137
చెల్లించే మొత్తం: రూ.6,463.65లక్షలు

'నన్నయ'లో ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ సెలెక్షన్స్



రన్నింగ్‌లో పోటీపడుతున్న విద్యార్థులు

రాజానగరం: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ద్వారా విద్యార్థులు సేవాభావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన, విలువలు వంటి మంచి లక్షణాలను అలవర్చుకునే అవకాశం ఉంటుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యూనివర్సిటీ క్రీడా మైదానంలో వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ సెలెక్షన్స్ బుధవారం జరిగాయి. గోదావరి జిల్లాల నుంచి 250 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఈ క్యాంప్‌నకు హాజరై పోటీ పడ్డారు. రన్నింగ్ రేస్, మార్చ్ ఫాస్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి వాటిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని పరేడ్‌కి ఎంపిక చేస్తారు. ఎంపికైనవారు జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే కార్యక్రమంలో 'నన్నయ' యూనివర్సిటీ ఔన్నత్యానికి చిహ్నాలుగా నిలుస్తారని వీసీ అన్నారు. ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ ఇక్కడ ఎంపిక చేసిన వారిని ప్రీ ఆర్డీ క్యాంప్‌నకు పంపిస్తామని, అక్కడ కూడా ప్రతిభ కనబర్చిన వారిని ఢిల్లీ క్యాంప్‌కి ఎంపిక చేస్తారన్నారు. ప్రీ ఆర్డీ క్యాంప్ ఈ ఏడాది విజయవాడలో జరగనున్నదని, అక్కడకు ఏపీతోపాటు ఆరు రాష్ట్రాల నుంచి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వస్తారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కేఎస్ రమేష్, ఎన్ఎస్ఎస్ ఆఫీస్ సూపరింటెండెంట్ సంజయ్, డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, పీటీలు, పీఈటీలు పాల్గొన్నారు.

హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

కాకినాడ లీగల్: తన కుమార్తెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిని హత్య చేసినందుకు జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా, ఆ సమయంలో అడ్డు వచ్చిన కుమార్తెపై హత్యాయత్నం చేసినందుకు పదేళ్లు జైలు, రూ.5వేలు జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి బుధవారం తీర్పు చెప్పారు. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం కాకినాడకు చెందిన పటాల నాగేశ్వరరావు కుమార్తె దుర్గాభవానీతో పెండ్యాల రవిశంకర్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అయితే 2015లో రామారావుపేట అపార్ట్‌మెంట్‌లో పెండ్యాల రవిశంకర్, దుర్గాభవానీ కలిసి ఉండడంతో రవిశంకర్‌పై కత్తితో నాగేశ్వరరావు దాడి చేయగా మృతిచెందాడు. ఆ సమయంలో దుర్గాభవానీపై కత్తితో దాడి చేయగా తీవ్రగాయాల పాలైంది. దీనిపై మృతుడు భార్య పెండ్యాల అనంతలక్ష్మిదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో నాగేశ్వరరావుపై నేరం రుజువు కావడంతో హత్య చేసినందుకు జీవిత ఖైదు శిక్ష, రూ.10వేలు, కుమార్తె పై దాడి చేసినందుకు పదేళ్ల జైలు,రూ 5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు జరపాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

చెరువులో బాలుడి మృతదేహం



హోసన్న (ఫైల్)

చాగల్లు: స్థానిక మాతంగి చెరువులో బుధవారం తొమ్మిదేళ్ల బాలుడి మృతదేహం లభ్యమయినట్టు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చెరువులో మృతదేహం తేలిందని స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా ఆ మృతదేహం కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామానికి చెందిన వీరపల్లి హోసన్న(9)గా నిర్ధారించినట్టు తెలిపారు. హోసన్న ఈ నెల 10వ తేదీన చాగల్లులో చర్చికి కుటుంబ సభ్యులతో వచ్చాడు. హోసన్న మానసిక వైకల్యంతో బాధపడుతున్నాడు. బాలుడికి మాటలు రావు. ప్రార్థన సమయంలో చర్చి నుంచి బయటికి వచ్చి అదృశ్యం అయ్యాడు. బాలుడి తండ్రి జాన్‌రత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అదుపు తప్పిన కాలేజీ బస్సు..తప్పిన పెనుముప్పు

రాజోలు: విద్యార్థులు ప్రయాణిస్తున్న ఒక ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీ బస్సు బుధవారం శివకోడులో అదుపు తప్పింది. బ్రేక్ ఫెయిల్ కావడడంతో శివకోడు పెట్రోలు బంక్ ఎదురుగా ఉన్న కొబ్బరితోటలోకి దూసుకుని వెళ్లి ఒక పక్కకు ఒరిగిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 20 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. సఖినేటిపల్లి నుంచి ఓడలరేవులో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలకు బస్సుల్లో వెళ్తున్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు అయ్యాయి. బస్సు పక్కకు ఒరిగిపోయిన సమయంలో విద్యార్థులు అత్యవసర ద్వారం నుంచి బయటకు వచ్చారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని రాజోలు ఎస్సై పృథ్వీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

గండేపల్లి: అనారోగ్యానికి గురైన మనవడికి ఎక్సరే తీయించేందుకు ఆస్పత్రికి వెళుతూ వారే ఆస్పత్రి పాలైన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కె. నాయకంపల్లికి చెందిన కొల్లు కృష్ణ, కృష్ణవేణిల మనవడికి అనారోగ్యం కారణంగా ఎక్సరే తీయించేందుకు వారిద్దరూ ఒక మోటార్ సైకిల్, మనవడితో వారి బంధువులు మరో మోటార్ సైకిల్‌పై మండల పరిధిలో గల ఎక్సరే సెంటర్‌కు బయలుదేరారు. నీలాద్రిరావుపేట పరిధిలో చక్రవర్తినగర్‌కు వచ్చేసరికి రోడ్డుపై నిలిచిఉన్న వ్యాన్‌ను ఢీకొట్టడంతో కృష్ణ ముఖానికి, రోడ్డుపై పడ్డ కృష్ణవేణికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న రోడ్డు సేఫ్టీ పోలీస్ వాహన సిబ్బంది వరకుమార్, సతీష్ క్షతగాత్రులను స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్‌లో జగ్గంపేటలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వీరిలో కృష్ణవేణి పరిస్థితి విషమంగా ఉండటంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న జగ్గంపేట హెచ్‌సీ రామకృష్ణ, కానిస్టేబుల్ రెడ్డి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు గండేపల్లి పోలీసులు తెలిపారు.

'ద్వారక'లోనూ బస్‌స్టాప్ ఏర్పాటు

కాకినాడ: కాకినాడ–విశాఖ మధ్య నడిచే అన్ని నాన్ స్టాప్, ఎక్స్‌ప్రెస్ బస్సులు వైజాగ్ ద్వారక బస్‌స్టేషన్ వద్ద కూడా నిలుపుదల చేస్తామని డిపో మేనేజర్ ఎంయువీ మనోహర్ చెప్పారు. ప్రస్తుతం కాకినాడ– విశాఖపట్నం మధ్య నడిచే బస్సులు మద్దిలపాలెం బస్‌స్టేషన్ మీదుగా వస్తున్నాయని, ఈ క్రమంలో ప్రయాణికుల విజ్ఞప్తుల మేరకు ద్వారకా బస్‌స్టాప్ వద్ద కూడా నిలుదల చేయాలని నిర్ణయించామన్నారు. మద్దిలపాలెంతోపాటు ద్వారకా బస్‌స్టేషన్ వద్ద కూడా బస్సులు ఆగుతాయని, రిజర్వేషన్ కూడా చేయించుకోవచ్చునన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

- ఒకరి మృతి
- ఐదుగురికి తీవ్ర గాయాలు



మృతుడు అర్జి నాగేశ్వరరావు (ఫైల్)

కావలి/రాజానగరం: తిరుమలకు బయలుదేరిన వ్యక్తులకు చెందిన ఆటోను లారీ ఢీకొన్న ఘటన బుధవారం కావలి మండలం ముసునూరు సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో తూర్పుగోదావరి జిల్లా రాజానగరం ప్రాంతానికి చెందిన వంట మనిషి అర్జి నాగేశ్వరరావు (59) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో డ్రైవర్ సహా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. రాజానగరం మండలం నరేంద్రపురంతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 500 మంది భక్తులు ఆదివారం తిరుమల యాత్రకు సైకిళ్లపై బయలుదేరారు. వీరికి అవసరమైన భోజనం తయారు చేసేందుకు అవసరమైన సరుకులతో ఆరుగురు వ్యక్తులు ఆటోలో బయలుదేరారు. ముసునూరు సమీపంలోకి వచ్చేసరికి ఆటో ప్రమాదానికి గురైంది. మితిమీరిన వేగంతో వెళ్తున్న లారీ ఆటోను వెనుక వైపు ఢీకొంది. దీంతో ఆటో రోడ్డు పక్కనే ఉన్న పంటకాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నాగేశ్వరరావు తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో డ్రైవర్ చౌటుపల్లి శ్రీను, ఉల్లి పుల్లయ్య, మారెడ్డి రాంబాబు, తర్రా శీను, గుత్తల రాజు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తొలుత కావలి ఏరియా వైద్యశాలకు అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కావలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



పంట కాలువలో పడిపోయిన ఆటో

తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే రాజా : ఈ వార్త తెలిసిన వెంటనే విజయవాడలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా ఆ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడి, తక్షణమే సహాయక చర్యలు అందించే ఏర్పాట్లు చేశారు. విషమంగా ఉన్న ఉల్లి పుల్లయ్యను బంధువుల విజ్ఞప్తి మేరకు రాజమహేంద్రవరానికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. మృతుడు అర్జి నాగేశ్వర్రావుకు ఒక అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలు ఉండగా, వారిలో అమ్మాయిలిద్దరికీ వివాహాలు చేశాడు.

మూడు దశాబ్దాలుగా సాగుతున్న యాత్ర

నరేంద్రపురానికి చెందిన ప్రగడ అంకాలు నియమనిష్ఠలతో దీక్ష చేసి, సైకిలు పై తిరుమలకు వెళ్లి శ్రీనివాసుని దర్శించుకుని వచ్చే కార్యక్రమానికి మూడు దశాబ్దాల క్రితం శ్రీకారం చుట్టారు. రానురాను అతనితోపాటు పయనమయ్యే భక్తుల సంఖ్య గ్రామాలు దాటి పెరుగుతూ వచ్చింది. ఈ విధంగా నరేంద్రపురం, మడికి, కడియపులంక, బుర్రలంక మున్నగు ప్రాంతాల నుంచి సుమారు 500 మంది భక్తులు ఈనెల 10న సైకిళ్ల పై తిరుమలకు పయనమయ్యారు.

బంగారు ధ్వజ స్తంభానికి టేకు చెట్టు ఎంపిక

అన్నవరం: రత్నగిరిపై సత్యనారాయణ స్వామివారి ఆలయంలో కొత్త ధ్వజ స్తంభం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలోని టేకు వనంలో సుమారు 80 అడుగుల పొడవు గల టేకు చెట్టును దేవస్థానం అధికారులు ప్రాథమికంగా ఎంపిక చేశారు. రౌతులపూడి మండలం ములగపూడికి చెందిన కొరుప్రోలు ఏసుబాబు ఈ టేకు చెట్టును స్వామి వారికి ఉచితంగా అందజేయనున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన దాత ఒకరు స్వామివారికి రూ.3కోట్లతో బంగారు ధ్వజస్తంభం ఏర్పాటుకు ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. గురువారం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్, ఏసీ రమేష్‌బాబు, అటవీశాఖ అధికారులు మారేడుమిల్లిలో టేకు చెట్టును పరిశీలించనున్నారు.



అధికారులు ఎంపిక చేసిన టేకు చెట్టు

టేకు లేదా సోమంచి కర్ర అవసరం

ధ్వజ స్తంభానికి టేకు లేదా సోమంచి కర్ర ఉపయోగిస్తారు. సుమారు 65 అడుగుల పొడవైన కర్ర అవసరం. కొమ్మలు ఉండకూడదు, నిటారుగా పెరగాలి. సోమంచి కర్ర అందుబాటులో లేకపోవడంతో టేకు కర్రను ఎంపిక చేశారు. మారేడుమిల్లిలోని టేకు కర్ర అన్ని విధాలా సరిపోతుందని భావిస్తే ఒకటి రెండు రోజుల్లో అన్నవరం తరలిస్తారు. తరువాత మూడు కిలోల బంగారం రేకుతో తాపడం చేస్తారు. పండితుల వైదిక కార్యక్రమాలతో ఘనంగా ధ్వజ స్తంభం ప్రతిష్ఠిస్తారు. వచ్చే జనవరి కల్లా ధ్వజ స్తంభం ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు.